క్లుప్తంగా

ప్రేమీమండలిలో హిందీ తరగతులు

తెనాలి: గత ఫిబ్రవరిలో నిర్వహించిన హిందీ పరీక్షల ఫలితాలు విడుదలైనందున పట్టణ నాజరుపేటలోని హిందీ ప్రేమీమండలి మహా విద్యాలయంలో ఈనెల 15వ తేదీ నుండి హిందీ తరగతులు ప్రారంభించారు. ప్రేమీమండలి మహావిద్యాలయం అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, కార్యదర్శి డాక్టర్ ఈలప్రోలు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ఈ విషయాన్ని తెలియజేశారు. వేసవి సెలవుల్లో పిల్లలు ఎక్కువగా చదవడానికి అవకాశం ఉన్నందున ఈ సదవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రాథమిక నుండి అన్ని రకాల హిందీ పరీక్షలకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ఉదయం, సాయంత్రం తరగతులు ఉంటాయని వివరించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ



తెనాలిఅర్బన్: వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ తెనాలి డిపో ఆధ్వర్యంలో మంగళవారం ఉద్యోగులకు మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ డ్రైవర్లు, కండెక్టర్లు వేసవి కాలంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎండ వేడి తగలకుండా తగ్గు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవి కాలంలో ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు క్షయవ్యాధిపై అవగాహన సదస్సు

కొల్లిపర(తెనాలి): మండల కేంద్రమైన కొల్లిపరలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు టీబీ వ్యాధిపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఎంఆర్ ఫ్యూచర్ ఫౌండేషన్, జిల్లా ఆరోగ్యశాఖ సంయుక్త నిర్వహణలో ఏర్పాటయే సమావేశంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరవుతారు. టీబీ వ్యాధిపై అవగాహనను కల్పించటమే కాకుండా టీబీ రోగులకు అవసరమైన పోషకాహార కిట్లను ఎంఆర్ ఫౌండేషన్ పంపిణీ చేయనుంది. పీఎంటీబీఎంబీపీ న్యూట్రిషన్ సపోర్ట్ ప్రోగ్రాంలో భాగంగా ఈ సదస్సును ఏర్పాటు చేసినట్టు ఎంఆర్ ఫ్యూచర్ ఫౌండేషన్ చైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ మేఘనా రెడ్డి కొల్లి మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ



తెనాలిఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ సభ్యులు నంబూరు శ్రీకుమార్, వెంకట వరలక్ష్మి దంపతుల పెళ్ళిరోజును పురస్కరించుకుని చంద్రబాబునాయుడు కాలనీలో స్పెషల్ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లోని విద్యార్థులకు మంగళవారం 100 స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ళ కృష్ణమోహనరావు, వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రమణ్యం, పొదర్తి వెంకటేశ్వరరావు, అయినాల మల్లేశ్వరరావు, కోణిజేటి రమేష్‌కృష్ణ, హెచ్ఎం బత్తుల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు దేవరపల్లి ప్రదీప్‌చంద్, షేక్ జరీనా, గోలి ప్రమీల, షేక్ షాహీనా, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



తెనాలిరూరల్: కొబ్బరికాయల పనికి వెళ్లే వ్యక్తి అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అంగలకుదురు గ్రామానికి చెందిన 56 ఏళ్ల తిరుమలశెట్టి వీరరాఘవయ్య ఏలూరులో కొబ్బరికాయల పనికి వెళుతుంటాడు. ఈ క్రమంలో ఈ నెల 8వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులకు ఎటువంటి సమాచారం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. కేసు మంగళవారం నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ సి.హెచ్. ప్రతాప్‌కుమార్ తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

దుగ్గిరాల: దుగ్గిరాల మండలంలో పెసర కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్నాయి. రైతులు ఎంఎస్‌పీ ధర కంటే తక్కువ ధరకు అమ్ముకోవద్దని అధికారులు తెలిపారు. పంట నమోదు, ఈ-కేవైసీ చేయించుకున్న రైతులు రైతు సేవా కేంద్రాలలో పంట వివరాలు తెలియజేసి కొనుగోలుకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. క్వింటాకు ఖరీఫ్ వరి రూ.2,300, జొన్న రూ.3,331, మొక్కజొన్న రూ.2,225, పెసర రూ.8,682, మినుము రూ.7,400, వేరుశనగ రూ.6,783 ధరలు నిర్ణయించారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పొంచి ఉన్న వేసవి వ్యాధులు

- ఎండలతో ప్రమాదమేనంటున్న వైద్యులు
- టైఫాయిడ్, డయేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి
- వడదెబ్బ తగలకుండా జాగ్రలు పాటించాలి

ప్రారంభంలోనే కిటకిటలాడుతున్న ఆస్పత్రులు



కొల్లిపర సీహెచ్‌సీలో రోగులతో కిటకిటలాడుతున్న దృశ్యం

కొల్లిపర: గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి మార్చిలోనే పగటి ఉష్ణోగ్రతలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎండలో బయటకు వెళ్లాలంటే ప్రజలు చిన్న పెద్ద అనే తేడా లేకుండా బెంబేలెత్తిపోతున్నారు. ఎండకాలం వచ్చిందంటే కొన్ని రకాల వ్యాధులు కూడా అదేస్థాయిలో వ్యాప్తిచెందుతాయి. దీంతో ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు ఎక్కువ శాతం రోగుల తాకిడి పెరుగుతోంది. ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు పాటించకపోతే ప్రాణాలు కూడా పోయే ప్రమాదం ఉందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎండకాలంలో వచ్చే ముఖ్యమైన వ్యాధులు, తీసుకోవల్సిన జాగ్రత్తలపై వైద్య నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు. అవి ఇలా.

వడదెబ్బ

ఎండలు పెరగడంతో శరీరం ఉష్ణోగ్రతను నియంత్రించుకోలేని స్థితికి చేరుతుంది. దీంతో శరీరంలోని ఎలక్ట్రోలైట్స్, మినరల్స్, నీటి శాతం తగ్గి బలంలేని స్థితికి శరీరం చేరుతుంది. దీన్నే ఎండ దెబ్బ(వడ దెబ్బ) శరీర ఉష్ణోగ్రత పెరగడం, ఒక్క సారిగా చెమట పట్టడం, గుండె వేగంగా కొట్టుకోవడం, కండరాలు గట్టిపడడం, చర్మం ఎర్రగా మారడం, వాంతి వచ్చినట్లు ఉండడం లేదా వాంతి చేసుకోవడం, మూర్చ రావడం, తల నొప్పి, ఒకొక్కసారి కోమాలోకి వెళ్లడం లాంటి లక్షణాలు వడదెబ్బ సోకిన వారిలో కనిపిస్తాయి.

జాగ్రలు: వడదెబ్బ సోకిన వారికి వైద్యుల సలహాతో మందులు వాడాలి. రోజుకు 15 నుంచి 20 గ్లాసుల నీరు తాగాలి. పండ్లు, నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, చెరుకు రసాలు వంటివి ఎక్కువగా తీసుకోవాలి, తెల్లటి దుస్తులు ధరించడం మంచిది.

> **ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి**
>
> వేసవిలో వచ్చే వివిధ వ్యాధులపై ముందస్తు అప్రమత్తం అవసరం. వ్యాదుల నుంచి ఉపశయపం పొందడానికి మంచి నీరు. కొబ్బరి నీరు, మజ్జిగా ఎక్కువగా తాగాలి. ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలి. సీహెచ్‌సీ, పీహెచ్‌సీలో మందులు అందుబాటులో ఉన్నాయి. ఓఆర్ఎస్, జింక్ ట్యాబ్లెట్లు వైద్యశాలలో ఉన్నాయి. ప్రతి ఒక్కరూ అవి తీసుకుని వాడితే మంచిది.
>
> బి.భరత్ డాక్టర్, మెడికల్ ఆఫీసర్, కొల్లిపర సీహెచ్‌సీ

గవద బిళ్లలు

వైరస్ కారణంగా గవద బిళ్లలు వస్తాయి. లాలాజలం గ్రంధులకు వాపు రావడం, జ్వరం, తల నొప్పి, ఒళ్లు నొప్పులు, అలసట, ఆకలి లేకపోవడం ఈ వ్యాధి లక్షణాలు.

జాగ్రత్తలు: ఈ వ్యాధికి ముందుస్తుగా ఎంఎంఆర్ వ్యాక్సిన్ వేయించుకోవడం మంచిది. పూర్తిగా తగ్గే వరకు ఎండలో పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

అతిసార

అతిసార సోకిన వారికి నీళ్ల విరేచనాలు అవుతాయి. పిల్లలు, వృద్ధులకు ఈ వ్యాధి సోకితే చాలా ఇబ్బంది. సకాలంలో స్పందించకపోతే ప్రాణాలకే ప్రమాదం, కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు, ఒక్కసారిగా బరువు తగ్గడం, శరీరంలో నీటి శాతాన్ని కోల్పోవడం జరుగుతుంది.

జాగ్రత్తలు: నిల్వ ఉన్న ఆహారం, నీరు తీసుకోకూడదు. ఎలక్ట్రాల్ పౌడర్‌తో నీటి శాతం, లవణాలు పెంచుకోవచ్చు. వ్యాధి పూర్తిగా తగ్గిన తరువాత ఆహారం, నీరు తీసుకోవాలి.

టైఫాయిడ్

ఇది అపరిశుభ్రత నీరు. కలుషిత ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల ఆశిస్తుంది. అతి జ్వరం, అలసట, నిస్సత్తువ, కడుపునొప్పి, తలనొప్పి, ఆకలి లేకపోవడం టైఫాయిడ్ లక్షణాలు. అలాగే చర్మ సమస్యలు కూడా తెలెత్తుతాయి.

జాగ్రత్తలు: శుభ్రమైన మంచి నీటిని, ఆహారాన్ని తీసుకోవాలి. బయట దొరికే చిరుతిళ్లు పూర్తిగా మానేయాలి, వైద్యుడిని సంప్రదించి మందులు వాడాలి.

చికెన్‌ఫాక్స్ (ఆటలమ్మ)

కోడిపై ఉండే మచ్చల మాదిరిగానే మన శరీరంపై నల్లని మచ్చలు వస్తాయి. ఈ వ్యాధి కలిగించే వైరస్‌కు వేసవికాలం చాలా అనుకూలంగా ఉంటుంది. ఇది అటువ్యాధి, శరీరం తీవ్ర జ్వరంతో ఉంటుంది. అలసట, ఒంటిపై బుడగలు తేలడం, తలనొప్పి, దురద, ఆకలి తగ్గడం దీని లక్షణాలు.

జాగ్రత్తలు: వ్యాధి తగ్గడానికి కనీసం 10 నుంచి 15 రోజుల సమయం పడుతుంది. వ్యాధి గ్రస్తులు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి. వీరి నుంచి ఇంకొకరికి సోక కుండా దూరంగా ఉంచడం మంచిది.

మీజల్స్

ఇది ఎక్కువగా ఎండాకాలంలోనే చిన్న పిల్లలకు వస్తుంది. పారామిక్స్ వైరస్ కారణంగా వ్యాధి సంక్రమిస్తుంది. దీని వల్ల గొంతు వెనుకభాగంలో ఒక పొరలా ఏర్పడుతుంది. తీవ్రమైన జ్వరం , దగ్గు, జలుబు, గొంతు నొప్పి, కళ్ల ఎర్రబడడం, నుదుటిపై ఎర్రని మచ్చలు వస్తాయి.

జాగ్రత్తలు: వైద్యుడి సలహాలతో మందులు వాడాలి, వ్యాధి సోకిన వారి నుంచి పిల్లలకు దూరంగా ఉంచాలి. ముందుస్తుగా వ్యాక్సిన్ వేయించడం మంచి. వైద్యులు సలహాలు పాటించాలి.

మలేరియా

మలేరియా ఆడ అనాఫిలిస్ దోమ కాటు ద్వారా వ్యాప్తిస్తుంది. మూడు దశల్లో వ్యాధి ప్రభావం చూపుతుంది. మొదటి దశలో అధిక చలి, తలనొప్పి, వాంతులు, జ్వరం ఉంటాయి. రెండోదశలో చర్మం వేడిగా, అధిక రక్తపోటు ఉంటుంది. మూడో దశలో చెమట పట్టడం, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

జాగ్రత్తలు: వైద్యుడి సూచనలు మేరకు మందులు తీసుకోవాలి. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మితహారం మంచిది.

డెంగీ జ్వరం

ఇదో రకమైన విష జ్వరం, దోమకాటు మూలంగా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది, ఈ వ్యాధి రెండు దశల్లో ఉంటుంది. అధిక జ్వరం, తల, కళ్లు, కండరాలు, కీళ్ల నొప్పులు తీవ్రంగా ఉంటాయి.

జాగ్రత్తలు: పగటి పూట కుట్టే దోమల నుంచి జాగ్రత్తలు పాటించాలి, ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు పెరిగే ప్రదేశాలను నిరోధించాలి.

అగ్రిగోల్డ్ బాధితుల పాదయాత్రను జయప్రదం చేయండి

జిల్లా అధ్యక్షుడు షేక్ బషీర్



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు షేక్ బషీర్

తెనాలిఅర్బన్: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం విజయవాడలో జరిగే పాదయాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు షేక్ బషీర్, తెనాలి కార్యదర్శి సిహెచ్.నరసింహారావులు పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం అగ్రిగోల్డ్ బాధితుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ ఆర్థిక మోసాలకు పాల్పడిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం బాధితులను పూర్తిగా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. సమావేశంలో షేక్ రఫీ, సుధాకర్, శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు బొల్లిముంత కృష్ణ, పి.వి.రాఘవ, శివ పార్వతి, అంజలి, అరుణకుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని పార్కులను ఉపయోగించుకోండి

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ పరిధిలోని పార్కులు తెల్లవారుజామున 5 గంటల నుంచి 9.30 గంటల వరకు మధ్యాహ్నం ఒంటి గంట 8 గంటల వరకు తెరచి ఉంటాయని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పై తెలిపిన సమయాల్లో మాత్రమే అనుమతి ఉంటుందని చెప్పారు. వేసవి సెలవులు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ పార్కు సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు.

మందిర నిర్మాణ విషయమై వినతి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మున్నంగి(కొల్లిపర): మండల పరిధిలోని మున్నంగి గ్రామంలో ఇందిర కాలనీలో హిందువుల ఇళ్ల మధ్య ఎటువంటి అనుమతులు లేకుండా, ప్రజల అభిప్రాయాలు సేకరించకుండా క్రైస్తవ మందిర నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు కొందరు తహసీల్దారు జి.సిద్ధార్థ, ఎంపీడీవో వి.విజయలక్ష్మిలకు మంగళవారం విన్నవించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామానికి చెందిన శాఖమూరి శివ శంకర్ భార్య శాఖమూరి అంజలి అనే మహిళ 2023లో ఇంటి స్థలం కోసమని గ్రామంలోని ఆళ్ళ జగపతిరెడ్డి వద్ద నుంచి కొంత భూమి కొనుగోలు చేసింది. ఆ భూమిలో కొంత అమరావతి మండలంలోని పెద్దమద్దూరు గ్రామానికి చెందిన తేజావత్ దేవానాయక్ కుమారుడు తేజావత్ నాగరాజు నాయక్ 2024లో ఆమె వద్ద నుంచి కొనుగోలు చేశాడు. తేజావత్ నాగరాజు ఒక పాస్టర్ కావటంతో ఇప్పుడు ఆ స్థలంలో నాగరాజు ఆదేశాల మేరకు అంజలి దగ్గర ఉంది హిందుల ఇళ్ల మధ్య ఎటువంటి అనుమతులు లేకుండా క్రైస్తవ మందిర నిర్మాణ పనులు చేపట్టాడు. దీంతో స్థానికులు ప్రశ్నిస్తే.. మా స్థలం మా ఇష్టం మీరు ఎవరిని తీసుకువచ్చినా మాకు భయం లేదనీ, ఏం చేసుకుంటారో చేసుకోండి, మీము ఎవరికీ భయపడమని బెదరించాడు. దీంతో చేసేది లేక తామంతా మండల స్థాయి అధికారులను ఆశ్రయించినట్లు వారు తెలిపారు. దీనిపై అధికారులు మాట్లాడుతు వెంటనే నిర్మాణ పనులు నిలిపివేసి, తప్పకుండా సంఘటన స్థలాన్ని పరిశీలిస్తామన్నారు. చుట్టుప్రక్కల ప్రజల అభిప్రాయాలు, చర్చి నిర్మాణానికి వారి వద్ద ఎటువంటి అనుమతులు ఉన్నాయి అన్న అంశాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారులను కలసిన వారిలో దాడి సుధాకర్, మున్నంగి యుగంధర్, మర్రి శ్రీనివాసరావు, వల్లూరి శివనాగేశ్వరరావు, కుంచాల పణీంద్ర, రాజమంద్రి విజయలక్ష్మి, మున్నంగి పద్మ, మాధవి, దుర్గా తదితరులు ఉన్నారు.

దోభీ ఘాట్‌లను పట్టించుకోండి



వైఎస్సార్ వాటర్ ప్లాంట్ పేరుకుపోయిన తూటాకు



కత్తులపేటలో నీళ్లు తగ్గడంతో అపరిశుభ్రంగా దోభీ ఖానా



పశువుల హాస్పిటల్ వద్ద చెత్తాచెదారంతో ఇలా..

తాడేపల్లిరూరల్: మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని బకింగ్‌హామ్ కెనాల్‌లోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన పలు దోబీ ఘాట్‌లు తూటికాడతో కూరుకుపోయాయి. దీంతో అక్కడ దుస్తులు ఉతుక్కునేందుకు వీల్లేకుండాపోయింది. వేసవిరావడంతో బకింగ్‌హామ్ కెనాల్ నీటి మట్టాన్ని పూర్తిగా తగ్గించి, కృష్ణానది నుంచి 300 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. కాలువలో నీటిమట్టం తగ్గడంతో గతంలో ఉన్న తూటికాడ నేలమీద అల్లుకుని ధోబీ ఘాట్‌లకు వెళ్లేందుకు వీలులేకుండా పోయింది. వైఎస్సార్ వాటర్‌ప్లాంట్, పశువుల ఆసుపత్రి వంతెన, అమరారెడ్డి నగర్(కత్తుల పేట) రైల్వే బ్రిడ్జి ప్రాంతాల్లో తూటాకుతో పాటు ఇసుక నేల బయట పడడంతో అక్కడ మందుబాబులు తిష్ట వేస్తున్నారు. మద్యం సేవిస్తూ గాజు సీసాలను అక్కడే పడేస్తున్నారు. దీంతో ధోబీ ఖానాకు వచ్చే మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. పశువుల ఆసుపత్రి వద్ద ఉన్న ధోబీఖానాలో చెత్తాచెదారం చేరడంతో అపరిశుభ్రంగా ఉంది. ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి తూటాకు తొలగించాలని పలువురు కోరుకుంటున్నారు.

లైంగిక వేధింపులపై అవగాహన



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు మంగళగిరిలోని ప్రాతూరు గ్రామంలో సామాజిక మాధ్యమాల్లో లైగింక వేధింపులపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వర్సిటీ విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడారు. వలంటీర్లు ఇంటింటికి వెళ్లి మహిళలకు, చిన్నారులకు ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాలపై అవగాహన లేకపోవడంతో లైంగిక వేధింపులకు గురికావాల్సి వస్తోందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగామ్ ఆఫీసర్ డాక్టర్ వి.జో నితిన్ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో నకిలీ ఖాతాల నుంచి అసత్యాలు ప్రచారం చేసినా, బెదిరింపులకు పాల్పడినా వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబరు 1930కి ఫిర్యాదు చేయాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్ రెడ్డి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కో-ఆర్డినేటర్ పి.సురేష్, వాలంటీర్లను యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె. రాజశేఖరరావు, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, డీన్ డాక్టర్ హబీబుల్లా ఖాన్, ఏఐ అండ్ డీఎస్ విభాగాధిపతి డాక్టర్ తిరుపతిరెడ్డి అభినందించారు.

పశువులకు గాలికుంటు టీకా



ఫిరంగిపురం: మండలంలోని యర్రగుంట్లపాడు గ్రామంలో మంగళవారం నుదురుపాడు పశువైద్యశాల ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకా వేసినట్లు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ తెలిపారు. 300 గేదెలు, 20 ఆవులకు టీకాలు వేసామని వెల్లడించారు. ఇప్పటికే నుదురుపాడు, ఫిరంగిపురం పశువైద్యశాలల పరిధిలో టీకా వేసినట్లు తెలిపారు. మిగిలిన వారు తమ పశువులకు టీకా వేయించుకోవాలని పేర్కొన్నారు.

అర్హులకు రుణాలు



తాడేపల్లిరూరల్: ఎస్సీ సామాజిక వర్గంలో అర్హులైన వారందరికి రుణాలు ఇచ్చే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి తెలిపారు. మంగళవారం తాడేపల్లి బైపాస్ రోడ్‌లోని ఆమె కార్యాలయంలో కార్పొరేషన్ అధికారులు, ముఖ్య బాధ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు పేదల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పేదలను ఆర్థికంగా పరిపుష్టి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మేనేజర్ కృష్ణవేణి, పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

వటపత్ర అలంకారంలో నారసింహుడు

మంగళగిరి టౌన్: మంగళాద్రిలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు వటపత్ర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాన్ని ఆలయ ఈవో రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. అలంకార ఆస్థాన కైంకర్యపరులుగా హైదరాబాద్‌కు చెందిన మేళ్లచెరువు సీతామహాలక్ష్మి వ్యవహరించారు.

వ్యవసాయంపై శాస్త్రీయ అవగాహన ఉండాలి




రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

తెనాలిటౌన్: వ్యవసాయంపై రైతులు శాస్త్రీయ అవగాహన కలిగి ఉండాలని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు సూచించారు. మంగళవారం రూరల్ మండలం కఠెవరం గ్రామంలో ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల బాపట్ల విద్యార్థులు రైతులకు ఆధునిక వ్యవసాయం, శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ వ్యవసాయ సహాయకురాలు వాణి, విద్యార్థులు పాల్గొని గ్రామస్థాయిలో పంట పంపిణీ, లింగ నిష్పత్తి, వృత్తి విభజన, రైతుల వర్గీకరణ వంటి అంశాలను చార్ట్ రూపంలో, రంగవల్లులు ద్వారా తెలియజేశారు. రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు తెలుసుకున్నారు. వ్యవసాయ వనరులను గుర్తించేందుకు గ్రామ మ్యాపింగ్,రైతుల ప్రయాణ మార్గాలను అంచనా వేయడానికి మొబిలిటీ మ్యాప్ రూపొందించారు. గ్రామ సమీపంలో ప్రభుత్వ సంస్థలు, వాటి ప్రాముఖ్యతను చాప్టర్ దయాగ్రామ్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో రైతులు కొల్లి ఉమాశంకర్‌రెడ్డి, గంపల సుబ్బరామయ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

రౌడీ మూకలు.. చిల్లర చేష్టలు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తరచుగా రౌడీ మూకలు ఏదో ఒక ప్రాంతంలో అల్లర్లు సృష్టించి, ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం పరిపాటిగా మారింది. తాజాగా మంగళవారం తెల్లవారుజామున ఉండవల్లి కోలా సుబ్బారావు బజారులో ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. కాసరనేని శ్రీనివాసరావు అనే యువకుడు ఉండవల్లి దేవుడి మాన్యంలో రెండేళ్ల క్రితం హోమం నిర్వహించాడు. అప్పట్లో టెంట్లు ఏర్పాటు చేసిన వారు వాటిని తీసుకువెళ్లకుండా అక్కడే వదిలివేయడంతో వాటిని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఆ విషయంలో తనకు సంబంధం లేదని కాసరనేని శ్రీనివాసరావు తేల్చి చెప్పాడు. టెంట్లు వేసిన వారికి డబ్బులు కూడా ఇచ్చేశాడు. అదనంగా తనకు డబ్బులు ఇవ్వాలంటూ తరచుగా టెంట్ల యజమాని పెండ్యాల రమేష్ శ్రీనివాసరావును బెదిరిస్తున్నాడు. శ్రీనివాసరావు ససేమిరా అనడంతో విజయవాడ నుంచి పది నుంచి పదిహేను మంది రౌడీ మూకలను తీసుకువచ్చి సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు సుమారు 4 గంటల పాటు శ్రీనివాసరావు ఇంటి తలుపులు కొడుతు, బూతులు మాట్లాడుతూ ఇంటి ఆవరణలో అర్ధనగ్నంగా నిలబడి నానా యాగీ చేశారు. దాంతో శ్రీనివాసరావు 100కు ఫోన్ చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. దాంతో అక్కడ ఉన్న రౌడీమూకలు ఒక్కొక్కరుగా వెళ్లిపోయారు. ఈ ఘటనపై తాడేపల్లి పోలీసులకు శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఉండవల్లి సెంటర్‌లో ఒక వ్యక్తి షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపు అద్దెకు తీసుకుని హోటల్ నిర్వహిస్తున్నాడు. ఆ కాంప్లెక్స్ యజమాని షాపు ఖాళీ చేయాలంటూ హోటల్ యజమానిపై వత్తిడి తీసుకువచ్చాడు. నేను వేరే షాపు చూసుకుంటున్నానని చెప్పినా వినకుండా ఏలూరు నుంచి కొంతమంది ట్రాన్స్‌జెండర్స్‌ను తీసుకువచ్చి రాత్రి సమయంలో షాపు తాళాలు పగలకొట్టి హోటల్‌లో ఉన్న సామాన్లు బయట పడవేసి తాళాలు వేసి వెళ్లారు. పెనుమాకలో ఒక మహిళ నివాసముంటున్న ఇంటిపై ఇదేవిధంగా కొండపల్లికి చెందిన వారు దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. ఎప్పుడు ఇలాంటి సంఘటనలు జరగలేదని, ఈ మధ్యకాలంలోనే ఇలాంటివి చోటుచేసుకుంటున్నాయని, పోలీసులు ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దుదాం



తాడేపల్లిరూరల్: చెత్త రహిత పట్టణంగా తాడేపల్లిని తీర్చిదిద్దాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని సీఎస్ఆర్ కల్యాణ మండపం, ఆశ్రమం ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని సచివాలయాల పరిధిలో చెత్తను పూర్తిగా తొలగించడమే లక్ష్యమని అన్నారు. ప్రజలు తడిచెత్త, పొడిచెత్తను వేరు వేరుగా మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, అదనపు కమిషనర్ శకుంతల, గొర్ల వేణుగోపాల్‌రెడ్డి, కె. ప్రసాద్, పి.సంపత్, రామారావు, దాసు, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

చర్చలతో కార్మికుల సమస్యను పరిష్కరించాలి



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న కొర్రపాటి ఆదినారాయణ

తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను చర్చల ద్వారా ప్రభుత్వం పరిష్కరించాలని యూనియన్ నాయకులు కొర్రపాటి ఆదినారాయణ అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని బి.అంకయ్యతో కలసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ గత 105 రోజులుగా కార్మికులు దీక్ష నిర్వహిస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు కార్మికుల సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారని చెప్పారు. ఇచ్చిన హామీని ఆయన నిలుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.హగ్గయ్య, ఎం.ఆశీర్వాదం, గురవయ్య, దుర్గాభవాని, ఇమాంబి, రమణ, రమేష్, సుబ్బారావు పాల్గొన్నారు.